సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం । 18 । మార్చి । 2025





అడ్డదారి లైసెన్స్‌లకు చెక్

అడ్డదారుల్లో తీసుకుంటున్న డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి రవాణాశాఖ అధికారులు చెక్ పెట్టనున్నారు. కొత్త పరీక్ష విధానం తీసుకురానున్నారు. - 8లో▸


గరిష్టం/కనిష్టం
38^0 /22^0


వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండవేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత తగ్గుతుంది.

ఏడాదంతా చదివింది ఒక ఎత్తయితే.. దాన్ని పరీక్షల్లో ప్రజెంట్ చేయడం మరో ఎత్తు.. కొందరు విద్యార్థులు బాగా చదువుతారు. తీరా పరీక్ష సమయానికి మరిచిపోతుంటారు.. మరికొందరేమో ఎంత చదివినా హ్యాండ్ రైటింగ్ బాగోలేక మార్కులు కోల్పోతారు.. ఇంకొందరైతే పరీక్ష అంటే గాబరా పడిపోయి ప్రశ్నలకు సమాధానం తెలిసినా నిర్ణీత సమయంలో రాయలేకపోతారు.. ఇలా చాలా మంది విద్యార్థులు ఏదో ఒక సమస్యతో బాధపడేవారే. వీరంతా మంచి మార్కులు సాధించేందుకు, పరీక్షలను ఈజీగా రాసేందుకు సబ్జెక్టు నిపుణులు సూచనలిస్తున్నారు. ఈనెల 21 నుంచి పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. మంచి మార్కులు సాధించడానికి ఆయా సబ్జెక్టుల నిపుణులను 'సాక్షి' పలకరించింది. విద్యార్థుల కోసం వారు తమ సూచనలు, సలహాలు వెల్లడించారు. - మహబూబాబాద్ అర్బన్

విజయీభవ





వివరాలు 8లో▸

'పది' ఫలితాలకు ప్రణాళికే కీలకం

- చక్కని రాతతో మార్కుల స్కోరింగ్
- పదో తరగతి పరీక్షల నేపథ్యంలో.. విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

పదో తరగతి వార్షిక పరీక్షలు మరో మూడ్రోజుల్లో ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలి. బాగా చదివాను.. పరీక్షలు బాగా రాస్తాను.. అనే భావనతో వెళ్లాలి. నెగెటివ్ ఆలోచనలను దరిచేర నీయొద్దు. గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. టీవీ, సెల్‌ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి. ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు వహించాలి. ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్ జోలికి వెళ్లొద్దు. సాత్విక ఆహారం తీసుకుంటే తొందరగా జీర్ణమవుతుంది. తగినంతగా నీరు తాగాలి. ఎవరైనా ఒత్తిడికి లోనైనా.. పరీక్షలంటే భయం కలిగినా 93911 17100, 94408 90073 నంబర్లకు ఫోన్ చేస్తే తగిన సూచనలిస్తాం.



- పోగు అశోక్, తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

నేడు రక్తదాన శిబిరం

హన్మకొండ అర్బన్ : తలసేమియా బాధిత పిల్లల కోసం నేడు(మంగళవారం) హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయం ఐడీఓసీ మొదటి అంతస్తు ఎఫ్–1లోని జిల్లా ట్రెజరీ కార్యాలయ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు డీటీఓ ఆకవరం శ్రీనివాస్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, టీజీఓస్, టీఎన్జీఓస్, డీఆర్‌డీఏ, ట్రెసా, క్లాస్–4, అన్ని ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు, బాధ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 309 మంది గైర్హాజరు

సాక్షి వరంగల్: వరంగల్ జిల్లా వ్యాప్తంగా సోమవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు కొనసాగాయి. జనరల్ కోర్సుకు 5,568 మందికిగాను 5,342 మంది విద్యార్థులు హాజరయ్యారు. 226 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి శ్రీధర్‌సుమన్ తెలిపారు. ఒకేషనల్ విద్యార్థులు 939 మంది కాగా 856 మంది పరీక్షకు హాజరవ్వగా 83మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

టెక్నికల్ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో టెక్నికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 28న నిర్వహిస్తున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం పలువురు నామినేషన్లను దాఖలు చేశారు. అధ్యక్ష పదవికి డాక్టర్ పుల్లా శ్రీనివాస్, జనరల్ సెక్రటరీగా ఎస్.రాము, ఉపాధ్యక్షుడిగా మెట్టు రవి, జాయింట్ సెక్రటరీ(ఆర్గనైజేషన్)గా వై.రవికుమార్, జాయింట్ సెక్రటరీ రిక్రియేషన్‌గా వై.బాబు, కోశాధికారిగా వి.ప్రేమ్‌సాగర్ నామినేషన్లను యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి టి.మనోహర్‌కు అందజేశారు. ఈనెల 20వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది.

నేటినుంచి జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 18, 19 తేదీల్లో రెండ్రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి తెలిపారు. 'ఇండియన్ కాన్స్టిట్యూషన్ మైల్‌స్టోన్స్–ఇష్యూస్ అండ్ చాలెంజెస్' అనే అంశంపై యూనివర్సిటీ సెనేట్‌హాల్‌లో సదస్సు ఉంటుందని వెల్లడించారు.

క్రైమ్ డీసీపీగా జనార్దన్ బాధ్యతలు



వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్ డీసీపీగా బి.జనార్దన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి వరంగల్‌లో ఎస్సైగా, ఇన్‌స్పెక్టర్‌గా, ఏసీపీగా పనిచేశారు. క్రైమ్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వరంగల్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు

జిల్లా కోర్టు జీపీగా నర్సింహారావు

వరంగల్ లీగల్ : హనుమకొండ జిల్లా కోర్టు ప్రభుత్వ న్యాయవాది(గవర్నమెంట్ ప్లీడర్)గా కాకిరాల నర్సింహారావును నియమిస్తూ రాష్ట్ర న్యాయశాఖ వ్యవహారాలు, న్యాయపాలన సెక్రటరీ ఆర్.తిరుపతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కుందూరుకు చెందిన నర్సింహారావు 33 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు.

గబ్బర్‌సింగ్ కావాలి

కొత్త పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్‌కు సమస్యల సవాళ్లు

- వదలని గంజాయి మత్తు..
- పట్టపగలే చైన్‌స్నాచింగ్‌లు
- భూపంచాయితీలకే ప్రాధాన్యం
- అడ్రస్ లేని పోలీసింగ్..?
- ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై కసరత్తు కరువు



వరంగల్ క్రైం:

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులకు దేశ స్థాయిలో మంచి పేరుంది. ఇక్కడి వారు సాధించిన విజయాలను ఐపీఎస్ ట్రైనింగ్‌లో సైతం చెబుతారు. అంతటి ఘన చరిత్ర ఉన్న కమిషనరేట్ చరిత్ర క్రమక్రమంగా మసకబారుతోంది. కొంత మంది పోలీస్ అధికారుల తీరు పోలీస్ శాఖ పరువును బజారున పడేలా చేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులపై కొంత కాలంగా ఎలాంటి క్రమశిక్షణ చర్యలు లేకపోవడంతో వారి అక్రమ సంపాదన 'మూడు పువ్వులు.. ఆరు కాయలుగా' వర్ధిల్లుతోంది. మూడు జిల్లాలకు విస్తరించి ఉన్న వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు నూతన కమిషనర్‌గా ఈనెల 10న సన్‌ప్రీత్‌సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎదుట అనేక సవాళ్లు కనిపిస్తున్నాయి.

ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై పట్టింపేది..?

కమిషనరేట్‌లోని అనేక మంది పోలీస్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై దృష్టిసారించడం లేదనే ఆరోపణలున్నాయి. టాస్క్‌ఫోర్స్ పోలీసులు కమిషనరేట్ వ్యాప్తంగా దాడులు నిర్వహించి పట్టుకున్న గుట్కాలు, గంజాయి, పీడీఎస్ బియ్యం, నకిలీ వస్తువులతో తరువాత ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిషేధించిన గుట్కా, ఇసుక రవాణా, పీడీఎస్ బియ్యం వంటి వాటిల్లో నెలవారీ మాముళ్లతో పోలీసులు తరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే డాన్ 'కోటీ'కి పడగలెత్తినట్లు ప్రచారంలో ఉంది.

భూపంచాయితీలకే ప్రాధాన్యం..

కమిషనరేట్ పరిధి చాలాపోలీస్‌స్టేషన్లలో భూముల పంచాయితీల హవా కొనసాగుతోంది. పలువురు పోలీస్ అధికారులు(ఎస్‌హెచ్‌ఓలు) పోలీసింగ్‌ను ఎస్సైలకు అప్పగించి వారు భూముల పంచాయితీల్లో తరిస్తున్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలోని ఓ సబ్ డివిజన్‌లో పనిచేసే పోలీసు అధికారులు భూములకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారని తెలుస్తోంది. కొంత మంది పోలీస్ అధికారులు మరో అడుగు ముందుకేసి వారి బినామీల పేరు మీద వివాదంలో ఉన్న భూములను తక్కువ ధరకు కొనుక్కుని వివాదాన్ని పరిష్కరించుకుంటూ లక్షలు కూడబెట్టుకుంటున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీసింగ్‌పై మారిన ప్రాధాన్యం..!

శాంతి భద్రతలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పోలీస్ అధికారుల ప్రాధాన్యత మారింది. రాత్రి పూట పెట్రోలింగ్ కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. విజిబుల్ పోలీసింగ్ లేక పట్టపగలే చోరీలు, హత్యలు, హత్యాయత్నాలు జరుగుతున్నాయి. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సన్‌ప్రీత్‌సింగ్ పోలీసింగ్‌కు మొదటి ప్రాధాన్యం అని ప్రకటించారు. దీంతో ప్రజల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. పోలీస్ శాఖలో అక్రమాలకు పాల్పడుతున్న కొంత మంది అధికారులపై చర్యలు తీసుకుంటే శాఖ గాడిన పడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

గంజాయి మత్తుతో కిక్కు..



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధితోపాటు గ్రామాల్లోనూ గంజాయి మత్తు కిక్కు ఎక్కిస్తోంది. ట్రైసిటీ పరిధిలో అనేక హాస్టళ్లలో గంజాయి గుట్కాల మాదిరిగా సులువుగా లభిస్తున్నదని పోలీసులు గ్రహించినప్పటికీ అరికట్టడంలో విఫలమయ్యారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు గంజాయి మత్తులో తరగతి గదుల్లో తన్నుకున్నారు. గ్రామాల్లో అనేక మంది యువకులు గంజాయి మత్తుకు బానిసలయ్యారు. గతంలో ఇక్కడ సీపీగా పనిచేసిన తరుణ్ జోషి గంజాయి అమ్మకాలపై దృష్టిసారించారు. గంజాయి సేవించే వారిపైనా కేసులు నమోదు చేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గంజాయి బానిసైన సుమారు 100 మంది యువతను రిహాబిటేషన్ సెంటర్‌కు తరలించి వారిని తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి గంజాయి వరంగల్ మీదుగా మహారాష్ట్రకు తరలుతోంది. ఈ రవాణాను అరికట్టడంలో పోలీసులు విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

పట్టపగలే చైన్ స్నాచింగ్‌లు..



కమిషనరేట్ పరిధి ట్రైసిటీలో పట్టపగలే చైన్ స్నాచింగ్‌లు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది మూడు నెలల్లో ఆరు చైన్‌స్నాచింగ్‌లు చోటుచేసుకోవడం గమనార్హం. ఒక పక్క పోలీస్ అధికారులు బ్లూకోల్ట్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేవని చెబుతున్నదానికి విరుద్ధంగా పట్టపగలే చోరీలు జరగడం గమనార్హం.

కమిషనరేట్ పరిధిలో జనవరి నుంచి ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు

చోరీలు : 36	చైన్ స్నాచింగ్ : 5
గంజాయి రవాణా 47	మహిళల కిడ్నాప్ 19
అత్యాచారం 22	వేధింపులు 91

కేసుల నమోదు ఇలా..

ట్రైసిటీ పరిధిలో ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మూడు నెలల్లో ఐదు చైన్‌స్నాచింగ్ కేసులు నమోదయ్యాయి. ద్విచక్ర వాహనాలపై వచ్చి మహిళల మెడలో నుంచి గొలుసులు లాక్కెళ్లారు. చోరీ కేసులు సుమారు 36 చోటుచేసుకున్నాయి. లక్షల రూపాయల విలువ కలిగిన బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణకు గురైంది. సీసీఎస్‌లో సంవత్సరాల తరబడి పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది కారణంగా రికవరీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. గంజాయి అక్రమ రవాణా చేస్తున్న, విక్రయిస్తున్న వ్యాపారులపై 47 కేసులు నమోదు చేశారు. అలాగే 19 మహిళల కిడ్నాప్ కేసులు, 22 అత్యాచారం కేసులు, 91 వేధింపుల కేసులు నమోదయ్యాయి.

మొక్కుబడిగా గ్రేటర్ గ్రీవెన్స్

అధికారుల తీరుపై అర్జీదారుల అసంతృప్తి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పక్కన మొబైల్ ఫోన్లలో లీనమైన వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్: బల్దియా గ్రీవెన్స్‌కు అందిన ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య సమన్వయం కొరవడింది. అయినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారానికి అర్జీదారులు వారం వారం వచ్చి వినతులు ఇచ్చి వెళ్లడం పరిపాటిగా మారింది. సోమవారం గ్రేటర్ వరంగల్ గ్రీవెన్ కార్యక్రమంలో ప్రజల నుంచి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే వినతులు స్వీకరించారు. ఈ క్రమంలో కమిషనర్ ఆశీనులైన వేదికపైనే కొంతమంది అధికారులు తమ మొబైల్ ఫోన్లను చూడడం, చిట్‌చాట్ చేయడం కనిపించింది. మరికొంతమంది ఉద్యోగులు కునుకు తీయడాన్ని ఫిర్యాదుదారులు గమనించి అసహనం వ్యక్తంచేశారు.

వెల్లువలా ఫిర్యాదులు

గ్రేటర్ గ్రీవెన్‌కు వివిధ విభాగాలకు సంబంధించి 88 ఫిర్యాదులు రాగా.. అందులో ఇంజినీరింగ్ సెక్షన్‌కు 24, ప్రజారోగ్యానికి 4, పన్నుల విభాగం 10, టౌన్ ప్లానింగ్ 46, తాగునీటి సరఫరా 4 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసున్నా రాణి, రాజేశ్వర్, హెచ్‌ఓలు రమేష్, లక్ష్మారెడ్డి, బయాలజిస్ట్ మాధవ రెడ్డి, పన్నుల విభాగం అధికారి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

- 3వ డివిజన్ ములుగు రోడ్డు కేఎస్ఆర్ గార్డెన్ సమీపంలో సొంతంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసుకున్నా లైట్లు ఏర్పాటు చేయడం లేదని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లా పైపులైన్లు ఏర్పాటు చేసి, కనెక్షన్లు ఇవ్వాలని కోరారు.
- మడికొండలోని కృష్ణ స్క్రాప్ షాపునుంచి దుర్గంధం వెదజల్లుతోందని, చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.
- వరంగల్ 16వ డివిజన్ గొర్రెకుంట మెయిన్ రోడ్డులో బస్‌షెల్టర్ నిర్మించాలని ఆమనగంటి ఏలేంద్ర విజ్ఞప్తి చేశారు.
- మడికొండలోని 1631 సర్వే నంబర్‌లో 770 గజాల పార్కు స్థలం కబ్జాకు గురైందని, తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఎస్సీ, బీసీ కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ కాకతీయ కాలనీ ఫేస్–2లో 10 ఫీట్ల రోడ్డును వెడల్పు చేయాలని స్థానికులు వేడుకున్నారు.
- భీమారంలోని 101 సర్వే నంబర్ వద్ద కమర్షియల్ బిల్డింగ్‌లో నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, తాము ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 66వ డివిజన్ హసన్‌పర్తిలో ఆక్రమణకు గురైన మహంకాళి ఆలయ స్థలాన్ని రక్షించాలని కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.
- 43వ డివిజన్ బృందావన కాలనీలో మిషన్ భగీరథ నల్లాలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు వినతి పత్రం అందజేశారు.
- కరీమాబాద్ శాకరాశికుంటలో అసంపూర్తిగా నిర్మించిన అండర్ డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని బర్కత్, హబీబ్ కోరారు.

నగరాభివృద్ధికి సహకరించాలి

మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న మేయర్ సుధారాణి, పక్కన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్ : ఆస్తి, నల్లా పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని నగర మేయర్ గుండు సుధారాణి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి పన్నుల వసూలు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కరణ పురోగతిని, రంజాన్ పండుగ సందర్భంగా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆస్తి పన్ను వసూలు లక్ష్యం రూ.118.06 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ.60.17 కోట్లు వసూలయ్యాయని, కేవలం పక్షం రోజుల సమయమే మిగిలి ఉన్నదని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి లక్ష దరఖాస్తులు రాగా 14,088 మంది క్రమబద్ధీకరించుకోవడానికి ఫీజులు చెల్లించారని, 680 మందికి క్రమబద్ధీకరణ ధ్రువపత్రాలు అందజేసినట్లు చెప్పారు. 25శాతం రిబేట్‌తో ఈనెల 31లోపు ఫీజులు చెల్లించి క్రమబద్ధీకరించుకునే విధంగా ప్రచారం నిర్వహించాలని చెప్పారు. రంజాన్ పండుగ ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, ప్రసన్న రాణి, రాజేశ్వర్, టాక్సేషన్ ఆఫీసర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినతులు త్వరగా పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆమె అర్జీలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ, డీపీఓ ఏడు చొప్పున, మిగతా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 76 వినతులు వచ్చినట్లు చెప్పారు. వినతులను పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఓ వై.వి.గణేష్, డీఆర్‌డీఏ మేన శ్రీను, సీపీఓ సత్యనారాయణరెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్‌డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

పింఛన్ ఇప్పించాలి

నడికూడ మండలం కంఠాత్మకూరు గ్రామానికి చెందిన సురేష్–మాలతి దంపతుల కుమారుడు అశ్విన్ తేజ(8) పుట్టుకతో దివ్యాంగుడు. నరాలు చచ్చుబడి ఎదుగుల లేకుండా జన్మించాడు. 'నాలుగు సంవత్సరాలుగా దివ్యాంగుల పింఛన్ కోసం తిరుగుతున్నాం.. సదరం ధ్రువీకరణ పత్రం కూడా ఉంది. తల్లిదండ్రులిద్దరం వ్యవసాయ కూలీలమే. ఎలాగైనా కొడుక్కి దివ్యాంగుల పింఛన్ ఇప్పించాలి' అని కలెక్టర్‌ను సురేష్–మాలతి దంపతులు ఈ సందర్భంగా వేడుకున్నారు.



ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ గ్రీవెన్స్‌కు 94 దరఖాస్తులు

వరంగల్: వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 94 దరఖాస్తులు రాగా.. కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ విజయలక్ష్మి స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 20, పోలీసు శాఖ 11, వైద్య ఆరోగ్యశాఖ 7, పౌర సరఫరాల శాఖ 7, కలెక్టరేట్ 6, జీడబ్ల్యూఎంసీ–6, విద్యాశాఖ–4 దరఖాస్తులతో పాటు వివిధ శాఖలకు సంబంధించి పలు సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి : డీఈఓ



ప్రత్యేక అవసరాల పిల్లలతో డీఈఓ తదితరులు

విద్యారణ్యపురి : ప్రత్యేక అవసరాల పిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని డీఈఓ డి.వాసంతి కోరారు. సోమవారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో జిల్లాలో ఎంపిక చేసిన ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాలను అందజేసి ఆమె మాట్లాడారు. భారతీయ కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలీంకో) ఉపకరణాలను అందజేసిందని తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్పి సమీపంలోని పాఠశాలల్లో వారి స్థాయికి తగిన తరగతిలో చేర్పించాలని చెప్పారు. ఈ సందర్భంగా వారికి వీల్‌చైర్లు, రోలేటర్స్, క్రష్ ఎల్‌బో అడ్జస్ట్ మెంటు, హియరింగ్ ఎయిడ్స్, బ్రెయిలీ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్య సమన్వయకర్త బద్దం సుదర్శన్‌రెడ్డి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ సునీత, ప్లానింగ్ కోఆర్డినేటర్ మహేష్, ఎంఈఓ నెహ్రూ, ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యాయవాదులు నైతిక విలువలు కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రయ్య

వరంగల్ లీగల్ : న్యాయవాద వృత్తిలో ఉన్నవారు నైతిక విలువలు కలిగి ఉండాలని రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలో 'లా అండ్ హ్యూమన్ రైట్స్' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ చంద్రయ్య హాజరై మాట్లాడారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నారాయణ మాట్లాడుతూ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన, అమలు చేసే విధానాలపై వారి అనుభవాలను తెలుపుతూ రాష్ట్ర జల వివాదాల చట్టం గురించి వివరించారు. అనంతరం ఉభయ బార్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో జస్టిస్ చంద్రయ్య, జస్టిస్ నారాయణలను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ, ఉభయ బార్ అసోసియేషన్ల అధ్యక్షులు జీవన్‌గౌడ్, యం.రమేష్ బాబు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు

కాజీపేట అర్బన్ : వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సోమవారం రికార్డు స్థాయిలో 140 దస్తావేజుల రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోగా ఖజానాకు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరింది. సాధారణంగా రోజూ వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 50 నుంచి 80 దస్తావేజులు రిజిస్ట్రేషన్ పూర్తవుతాయి. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ప్రకటించడంతో పాటు ఈనెల 31వ తేదీ చివరి గడువు ఉండడంతో అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు భూక్రయవిక్రయదారులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు రాత్రి 7 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించారు.

సంకటహర చతుర్థి పూజలు



హన్మకొండ కల్చరల్ : వేయి స్తంభాల దేవాలయంలో సోమవారం సంకటహర చతుర్థి పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో పండితులు గంగు మణికంఠ శర్మ, అర్చకులు పెండ్యాల సందీప్ శర్మ, పానుగంటి ప్రణవ్‌లు ఉదయం నుంచే ప్రభాత పూజ, శ్రీరుద్రేశ్వరస్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. సాయంత్రం 7గంటలకు సంకటచతుర్థిని పురస్కరించుకుని దేవాలయంలోని కాకతీయుల కాలంనాటి ఉత్తిష్టగణపతికి పంచసూక్తులతో జలాభిషేకం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం నవరస సుగంధ ద్రవ్యాలతో, హరిద్రాకుంకుమ జలాలతో అభిషేకాలు నిర్వహించారు. గణపతికి ఇష్టమైన గరికతో అష్టోత్తర శతనామాలు పఠిస్తూ షోడశోపచారపూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించాలి

- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ : విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ లోడ్ పెరిగే అవకాశం ఉన్న అన్ని చోట్ల అన్ని సర్కిళ్ల పరిధిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏ ర్పాటు చేశామన్నారు. ఇంటర్ లింకింగ్ పనులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పా టు, వీసీబీల ఏర్పాటు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్ఈలను ఆదేశించారు. ఏప్రిల్‌లో పంట కోతలు పూర్తి కాగానే వ్యవసాయ సర్వీసుల త్వరితగతిన రిలీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, టి.మధుసూదన్, సీఈలు తిరుమల్‌రావు, రాజు చౌహాన్, అశోక్, బీకం సింగ్, వెంకటరమణ, డీఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

20న జాబ్ మేళా

హన్మకొండ అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు ఈనెల 20న(గురువారం) జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పనా అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో వర్చువల్ సెల్స్ ఎగ్జిక్యూటివ్, యాక్సిస్ బ్యాంక్‌లో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 20 పోస్టుల భర్తీకి ములుగు రోడ్డు ప్రభుత్వ ఐటీఐ బాయ్స్ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 18–35 ఏళ్ల లోపు ఉండాలని, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి ఉన్న యువతీ యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98488 95937 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉద్యోగిని పట్ల డాక్టర్ అనుచిత ప్రవర్తన

ప్రైవేట్ ఆస్పత్రిలో ఘటన

హన్మకొండ చౌరస్తా: ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగిని పట్ల ఆస్పత్రి యజమాని అయిన డాక్టర్ అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. బాధితురాలు, ఆమె తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ పోచమ్మైదాన్‌కు చెందిన మహిళ ఏడాది కాలంగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో రిసెప్షనిస్టుగా పనిచేస్తున్నది. సోమవారం మధ్యాహ్నం ఆస్పత్రికి వచ్చిన డాక్టర్ రిసెప్షన్ వద్ద చిందరవందరగా ఉన్న ఫైళ్లను చూసి ఆగ్రహం వ్యక్తం చేశాడు. అంతటితో ఆగకుండా అనుచితమైన వ్యాఖ్యలు చేస్తూ వార్నింగ్ ఇచ్చి వెళ్లిపోయాడు. ఆస్పత్రి సిబ్బంది ఎదుట అవమానించడంపై బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తూ భర్తకు ఫోన్ చేసి తెలియజేసింది. దీంతో అతను 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. అయితే.. సదరు ఉద్యోగిని డాక్టర్ క్షమాపణ చెప్పడంతో సద్దుమణిగింది. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశంగా మారింది.

అడ్డదారి లైసెన్స్‌లకు చెక్

వాహనం సరిగా నడపగలిగితేనే లైసెన్స్.. లేదంటే అంతే

స్మార్ట్ టెస్ట్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళికలు రెడీ

- ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి స్వస్తి
- ఉమ్మడి జిల్లాలో అన్ని ఆర్టీఏల్లో స్థలాల సేకరణకు చర్యలు
- ఇప్పటికే ఆయా కలెక్టర్లకు ఆర్టీఓల వినతి



ఆర్టీఏ కార్యాయాల్లో నిర్మాణం కానున్న అధునాతన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ నమూన

ఖిలా వరంగల్ : రహదారులపై ఎక్కడ చూసినా కుప్పలు తెప్పలుగా వాహనాలు. లక్షలాది సంఖ్యలో బైకుల.. వేలాది సంఖ్యలో కార్లు కనిపిస్తున్నాయి. అయితే వీటన్నింటినీ నడిపే వారికి లైసెన్స్ ఉందా అంటే.. కొందరికి మాత్రమే ఉంటోంది. మరికొందరికి ఉండడం లేదు. మరి ఉన్నవాళ్లయినా సక్రమంగా తీసుకున్నారా అంటే.. బ్రోకర్ల ద్వారా అడ్డదారుల్లో తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రమాదాలకు కారణమవుతున్నారు. దీంతో రవాణాశాఖ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి పాత విధానం ట్రాక్‌పై డ్రైవింగ్ పరీక్ష పద్ధతికి చెక్ పెడుతూ.. స్మార్ట్ సెన్సార్ కెమెరాల నిఘాతో అధునాతన ట్రాక్‌పై కొత్త పరీక్ష తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీని వల్ల అడ్డదారిలో లైసెన్స్‌లు తీసుకునే వాహనచోదకులకు చెక్ పడనుంది.


అడ్డదారులు మూత!

ప్రస్తుతం.. ప్రతి ఇంట్లో ద్విచక్రవాహనం తప్పని సరి అయ్యింది. కొన్ని ఇళ్లల్లో ఒకటికి మించి ఉంటున్నాయి. ఆర్థికంగా ఉన్న వారు కారు కూడా కలిగి ఉంటున్నారు. ఫలితంగా రోజు రోజుకూ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరిగిపోతున్నాయి. అందుకు నిదర్శనమే రహదారులపై పెరిగిపోతున్న ట్రాఫిక్ జామ్. కొంత మంది డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకుండానే రోడ్డెక్కేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. మరి వాళ్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఉండదా.. అంటే ఉంటుంది. కానీ అది అడ్డదారిలో తీసుకున్నదై ఉంటుంది. డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలపై పూర్తి అవగాహన లేకుండా వాహనాలతో రోడ్కెక్కడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకు అడ్డదారుల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడమే కారణమని గ్రహించిన అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్స్ కోసం కొత్త పరీక్ష ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు ఉన్న మ్యానువల్ పరీక్షను తీయడానికి నిర్ణయం తీసుకున్నారు.

ఆధునికతకు చర్యలు..

తాజాగా వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను ఆధునీకరించాలని ఆర్టీఏ అధికారులు నిర్ణయించారు. అందుకోసం ప్రస్తుతం కొనసాగుతున్న పాత విధానం కంటే మరింత ప్రామాణికంగా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆటోమేటిక్ స్మార్ట్ సెన్సార్ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించేందుకు స్థలాల సేకరణలో అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో అడ్డదారిలో డ్రైవింగ్ లెసెన్స్ పొందడం కష్టమే..

ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతి..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లిలో రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో వరంగల్‌లో తప్ప మరెక్కడా డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ లేదు. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాలో ఆధునిక డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం వచ్చే వారికి వరంగల్ రవాణాశాఖ తనిఖీ అధికారులే పరీక్షలు నిర్వహించి లైసెన్స్‌లు అందజేసే పద్ధతి చాలాకాలం నుంచి కొనసాగుతోంది. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు వరంగల్ ఆర్టీఏకు 5 ఎకరాలు, మిగతా జిల్లాలో రోడ్డు పక్కాన 10 ఎకరాల స్థలాలు కావాలంటూ ఆర్టీఏ అధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లకు ఇటీవల వినతి పత్రాలు అందజేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు కావాల్సిన స్థలాల కోసం పరిశీలిస్తున్నారు.

వాహనం నడిపితేనే లైసెన్స్..

త్వరలో అందుబాటులోకి తీసుకురానున్న కొత్త పద్ధతిలో రహదారులపై నిత్యం ఎదురవుతున్న ఇబ్బందులను డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై కృత్రిమంగా కల్పిస్తారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వాళ్లు తప్పని సరిగా పరీక్ష రాయాల్సిందే.. ట్రాక్ మీద వాహనం నడిపిన తర్వాతే లైసెన్స్ పొందుతారు. అయితే ట్రాక్ మీద వాహనం నడిపేటప్పుడు కంప్యూటర్‌లో రికార్డవుతుంది. ఏదైనా చిన్న తప్పు చేసినా పరీక్ష ఫెయిల్ అయినట్లే..

కొత్త పద్ధతులు ఇలా..

కొత్తగా ఆర్టీఏ అమలు చేయబోయే ఆటో మెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పరీక్షలో 5 ట్రాక్‌లు ఏర్పాటు చేస్తారు. ముందు 'హెచ్' అనే ట్రాక్‌లో ఆర్టీఏ ప్రమాణాల్లో పేర్కొన్న విధంగా వాహనాన్ని రివర్స్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత 'ఎస్' అనే ట్రాక్‌లో ఒక మూల నుంచి మరో మూలకు వాహనాన్ని టర్న్ చేయాలి. అలాగే 'కే' అనే ట్రాక్‌లో బాగా మలుపులు, ఎత్తు పల్లాలు, ఎత్తయిన ప్రదేశాలు, చిన్న లోయలు వంటింటి ఏర్పాటు చేస్తారు. ఆ ట్రాక్‌లో వాహనాన్ని నడిపి చివరిగా పార్కింగ్ చేసి చూపించాల్సి ఉంటుంది. అయితే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ఈ ప్రక్రియ అంతా కంప్యూటర్‌లో రికార్డవుతుంది. వాహనాన్ని నడిపేటప్పుడు ఎలాంటి పొరపాట్లు చేసినా కంప్యూటర్‌లో రికార్డు అవుతుంది. ఏ చిన్న మిస్టేక్ చేసినా టెస్ట్‌లో ఫెయిల్ అయినట్లు చూపిస్తుంది. ఒక వేళ పరీక్షలో ఫెయిలైతే మరో నెల పాటు శిక్షణ తీసుకుని రమ్మంటారు. పూర్తిగా కంప్యూటరీకరణ కావడం వల్ల ఇక్కడ అధికారులను సిబ్బందిని మేనేజ్ చేసేందుకు ఏమాత్రం అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. బ్రోకర్లకు కూడా ఎలాంటి అవకాశం ఉండదని చెబుతున్నారు. దీంతో అడ్డదారుల్లో లైసెన్స్ పొందడం ఇక కష్టతరం కానుంది.

ట్రాక్ స్థలం కోసం వినతిపత్రం అందజేశాం



అధునాతన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ కోసం వరంగల్ ఆర్టీఏకు 5 ఎకరాల భూమి అవసరం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇటీవల కలెక్టర్‌ను కలిసి స్థలం కావాలని కోరుతూ వినతిపత్రం అందజేశాం. కలెక్టర్ సానుకూలంగా స్పందించి స్థలం ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

– శోభన్‌బాబు, ఇన్‌చార్జ్ ఆర్టీఏ, వరంగల్

వర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్ : రాష్ట్ర పరిధిలోని ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి, పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని, యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయొద్దని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం కేయూ సెనేట్‌హాల్‌లో 'యూజీసీ నూతన నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. యూజీసీ నూతన ముసాయిదాతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. అందుకే నూతన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో నాణ్యమైన విద్య బోధన జరగాలంటే సరిపడా అధ్యాపకుల నియామకాలు జరగాలన్నారు. తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్, కేయూ రిటైర్డ్ ఆచార్యుడు కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్.. యూనివర్సిటీల అభివృద్ధికి ఇచ్చే నిధులు బాగా తగ్గించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఇచ్చే యూజీసీ ఫెలోషిప్స్, స్కాలర్‌షిప్స్‌లో కోత విధించిందన్నారు. యూజీసీ నూతన ముసాయిదాతో యూనివర్సిటీల స్వయంప్రతిపత్తిని కాలరాయడమేనని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నున్న అప్పారావు, పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు ఇ. విజయ్‌కన్నా, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ, రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రీన్‌సుల్తానా పాల్గొన్నారు.

పరిపూర్ణమైన శిక్షణ ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి




మాట్లాడుతున్న సంధ్యారాణి

హసన్‌పర్తి : ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని ప్రజలకు సేవలందించే విధంగా ఆపద మిత్రలకు పరిపూర్ణమైన శిక్షణ ఇవ్వాలని వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతీ విహార్‌లో వరంగల్ జిల్లాకు సంబంధించిన ఆపదమిత్ర పథకం ద్వారా ఎంపికైన 120 మంది వలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయలక్ష్మి, జిల్లా అగ్నిమాపక నియంత్రణ అధికారి సతీష్, జిల్లా ప్రణాళిక అధికారి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కోర్టు ముందుకు కొత్త హరిబాబు?

- అరెస్ట్ చూపించి కోర్టులో హాజరుపరుచనున్న పోలీసులు
- సుప్రీంకోర్టును ఆశ్రయించనున్న సమయంలోనే పట్టుకున్న ఖాకీలు
- నిందితుడితో పాటు సహకరించిన మరో ఇద్దరు అదుపులోకి?



భూపాలపల్లి: సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి హత్య కేసులో ఏ8గా ఉన్న భూపాలపల్లి మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు కొత్త హరిబాబును నేడు (మంగళవారం) పోలీసులు అరెస్ట్ చూపించనున్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 19న రాజలింగమూర్తి దారుణ హత్యకు గురికాగా, ఈ కేసులో నిందితుడి(ఏ8)గా ఉన్న హరిబాబు పరారీలో ఉండగా పోలీసులు వెతుకుతున్నారు. ఈ క్రమంలోనే హన్మకొండకు చెందిన అతడి సన్నిహితుడి క్రెడిట్ కార్డు తీసుకెళ్లి వినియోగించడంతో హరిబాబు శనివారం రాత్రి ఢిల్లీలో పట్టుబడగా కారులో భూపాలపల్లికి తీసుకురాగా సోమవారం తెల్లవారుజామున చేరుకున్నట్లు సమాచారం. అయితే సోమవారం హరిబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ఉన్న కారణంగా అరెస్ట్ చూపించలేదని తెలుస్తోంది. నేడు(మంగళవారం) జిల్లా కేంద్రంలో అరెస్ట్ చూపించి, కోర్టులో హాజరుపరచనున్నట్లు సమాచారం.

సుప్రీంకోర్టును ఆశ్రయించే యత్నం..

రాజలింగమూర్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న కొత్త హరిబాబు ఈనెల 4న హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా, బెయిల్ వచ్చే అవకాశం లేదని గమనించి సుప్రీంకోర్టులో పిటిషన్ వేసేందుకు యత్నించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే క్రెడిట్ కార్డు వినియోగం ఆధారంగా అతడిని పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో మరో ఇద్దరు..?

కొత్త హరిబాబుతో పాటు అతడికి పని మనుషులుగా, సహకరించిన మరో ఇద్దరు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఢిల్లీలో హరిబాబును పోలీసులు పట్టుకోగా అక్కడే అతడికి సహకరించిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని సోమవారం తమదైన శైలిలో పోలీసులు విచారించినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసులకు చిక్కకుండా ప్రాంతాలు మార్చి..

హత్య కేసులో నిందితుడిగా ఉన్న హరిబాబు, ఇద్దరు సహాయకులతో కలిసి ప్రాంతాలు మార్చి పోలీసులకు చిక్కకుండా ప్రయత్నించినట్లు సమాచారం. ఢిల్లీ, సిమ్లా, అమృతసర్ లాంటి ప్రదేశాలను సందర్శించి చివరకు ఢిల్లీకి వచ్చి బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆశ్రయించే క్రమంలోనే పోలీసులకు చిక్కినట్లు తెలిసింది.

తెలుపు మచ్చలుంటే నిర్లక్ష్యం వద్దు

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



ఇంటింటి సర్వేను ప్రారంభించి పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ఎంజీఎం : శరీరంపై స్పర్శ లేని తెలుపు మచ్చలుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసిబ్బందిని కలిసి పరీక్షించుకోవాలని జిల్లా వైద్యాధికారి అప్పయ్య ప్రజలకు సూచించారు. కుష్టు లక్షణాలు కలిగిన వారిని గుర్తించేందుకు లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్‌సీడీసీ) ఇంటింటి సర్వేను సోమవారం అప్పయ్య బాలసముద్రంలో ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో వివక్షకు గురవుతామన్న ఆలోచనతో బయటకు చెప్పకపోవడంతో వ్యాధి ముదురుతోందని అన్నారు. స్పర్శ లేని మచ్చలు ఉన్న వారు స్వచ్ఛందంగా వచ్చి మొదట్లో చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమయ్యే అవకాశం ఉందని తెలియజేశారు. జిల్లాలోని 17 పీహెచ్‌సీలు, 7 యూపీహెచ్‌సీ పరిధిలో కుష్టు సోకిన వారిని గుర్తించేందుకు ఆశ కార్యకర్తల ద్వారా ఈనెల 31వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు, అనంతరం బాధితులకు చికిత్స అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్ రావు, వైద్యాధికారి గీత, వి.అశోక్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ ఎస్.శ్రీనివాస్, డీపీఎంఓ సతీష్‌రెడ్డి, సూపర్‌వైజర్ బజిలి సమ్మ, విప్లవ్‌కుమార్, రాజేష్, ఏఎన్ఎం అరుణ, ఆశకార్యకర్తలు స్వప్న, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

విజయీభవ..

- 'పది' ఫలితాలకు ప్రణాళికే కీలకం
- బట్టీ విధానానికి స్వస్తి పలకాలి..
- పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు సబ్జెక్టు నిపుణుల సూచనలు



బట్టీ విధానం వదిలేయాలి



భాషాంశాలు, వ్యాకరణాంశాలపై 20 మార్కులు వస్తాయి. ఆయా పాఠ్యంశాల వారీగా విభజించుకుని ఎక్కుసార్లు రాస్తూ చదవాలి. బట్టి విధానం వదిలేయాలి. కవి పరిచయాలు చదివి క్షుణంగా గుర్తుంచుకోవాలి. పాఠ్యాంశంపై పట్టు సాధిస్తే 12 మార్కులు సాధించొచ్చు. వ్యాకరణంలో సంధులు, సమాసాలు, అలంకారాలు, చంధస్సు అర్థాలపై అవగాహన పెంచుకుంటే అధిక మార్కులు సాధించే అవకాశం ఉంది.

– మద్దెర్ల రమేశ్, తెలుగు ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల), మహబూబాబాద్

హిందీని అర్థం చేసుకుని జవాబులు రాయాలి



పేరాగ్రాఫ్‌కు 20 మార్కులు కేటాయిస్తారు. హిందీ పార్ట్-ఏలో 60 మార్కులు ఉంటాయి. ప్రశ్నలు అర్థం చేసుకుని సమాధానాలు రాస్తే సరిపోతుంది. లేఖ, రచన, వ్యాసాలు, తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. పార్ట్-బీలో వ్యాకరణాంశాలు ఉంటాయి. అన్ని ప్రశ్నలకు సమాధానం రాస్తే 20కి 20 మార్కులు వస్తాయి. ఒక్క మార్కుల సమాధానాలు తప్పనిసరిగా రాయాలి.

– రంజాన్ అలీ, హిందీ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల), మహబూబాబాద్

స్పెల్లింగ్ మిస్టేక్స్ లేకుండా చూసుకోవాలి



కొట్టివేతలు లేకుండా పార్ట్ ఏ, బీ రాయాలి. డిస్కోర్స్‌లో ముఖ్యంగా ఏ-గ్రూప్ నుంచి సంభాషణ (కన్వర్షేషన్) డిస్క్రిప్షన్ (వివరణ) కొరియో గ్రఫీ, గ్రూప్-బీ నుంచి లేటర్, బయోగ్రాఫికల్ స్కెచ్, రిపోర్ట్ రైటింగ్ నుంచి ప్రశ్నలు ఎక్కువ వస్తాయి. పాఠ్యపుస్తకంలో ఏ.బీ, సీ రీడింగ్ ప్యాసేజెస్ పూర్తి అవగాహన, అర్థం చేసుకుని పరీక్ష రాస్తే 24 మార్కులు సాధించొచ్చు.

– గోడిశాల సంజీవ, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల), మహబూబాబాద్

గణితంలో సూత్రాలు గుర్తుపెట్టుకోవాలి



సమయం తక్కువ ఉన్న నేపథ్యంలో అభ్యస పుస్తకంలో ఎంపిక ప్రశ్నలు చదివితే చాలు. పార్ట్- ఏలో 12 మార్కులు రాయాలి. సెకండ్ బిట్‌లో 24 మార్కులు రాయాలి. గణితంలో బిట్స్‌కు 20 మార్కులున్నాయి. అందుకే ప్రతీ చాప్టర్ చదవాలి. సంఖ్యావ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖగణితం, తదితర అధ్యాయాలు చదువుతూ ప్రాక్టీస్ చేయాలి. సూత్రాలు రాయాలి. గుర్తుపెట్టుకోవాలి.

– ప్రతిభ, గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర), మహబూబాబాద్

ఒత్తిడికి గురికావద్దు



ఒక్కరోజే భౌతిక, జీవశాస్త్రాల పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ సైన్స్ మొదటి గంటన్నర భౌతికశాస్త్రం, తర్వాతి గంటన్నర జీవశాస్త్రం పరీ క్ష ఉంటుంది. అన్ని పాఠ్యాంశాల్లో ఉన్న ప్రయోగాలు, పట్టికలు, భేదాలు, పటాలు క్షుణ్ణంగా చదవాలి. పటాలు, వాటి భాగాలు రాస్తే సులువుగా ఐదు మార్కులు వస్తాయి. బిట్స్‌కు 10కి, బొమ్మలకు 6 మార్కులు వస్తాయి. ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలి.

– దోలి గిరిజ, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలికల), మహబూబాబాద్

సృజనాత్మకంగా ఆలోచించాలి



భౌతిక శాస్త్రంలో ప్రయోగశాల కృత్యం నుంచి ఒక వ్యాసరూపం సమాధానం రాయాలి. ఆమ్లాలు-క్షారాలు, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి, కాంతిధర్మాలు, క్వాంటం సంఖ్యలు, బంధాలు, వాటి ఏర్పాటు, లోహ సంగ్రహణ దశలు, హైడ్రోకార్బన్‌లు, వాటి నిర్మాణలపై బాగా రాయాలి. సృజనాత్మకంగా ఆలోచిస్తూ సమాధానాలు రాయాలి.

– ఏర్రబోయిన మాధవి, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు, జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర), మహబూబాబాద్

ప్రతీ ప్రశ్నకు సమాధానం రాయాలి



సాంఘిక శాస్త్రంలో, మ్యాప్ పాయింటింగ్‌లో ఇండియా, వరల్డ్, తెలంగాణ పటాలు గీయడం రాయాలి. పుస్తకంలో ఉన్న ప్రతీ పాఠ్యాంశాల్లో ఉన్న పట్టికలు, గ్రాఫ్‌లు చార్ట్స్, ప్రతీ సమస్య ప్రశ్నను చదివి క్షుణంగా పరీక్ష రాయాలి. చిన్న ప్రశ్నలను వదలకుండా రాయాలి. పది పాయింట్ల వాయిజ్ పరీక్ష రాస్తే అధిక మార్కులు వస్తాయి. బిట్స్‌కు సమయం కేటాయించి రాస్తే 20కి 20 మార్కులు వస్తాయి.

– పసమతి రమ, సాంఘిక శాస్త్రం టీచర్, జెడ్పీహెచ్‌ఎస్ కంకరబోర్డు

దైవదర్శనానికి వస్తూ.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- ముచ్చర్ల క్రాస్ సమీపంలో ఘటన



సుశాంత్ (ఫైల్)



విజయ్ మృతదేహం

హసన్‌పర్తి: దైవదర్శనానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు విద్యార్థులు దుర్మరణం చెందగా మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి పరకాల–కిట్స్ కళాశాల ప్రధాన రహదారిలోని ముచ్చర్ల క్రాస్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన మేకల సుశాంత్(19), మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం పొక్కురు గ్రామానికి చెందిన తాంద్ర విజయ్(19), జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం జైనా గ్రామానికి చెందిన సి.వర్ధన్ (18) స్నేహితులు. సుశాంత్ పరకాలలోని పాలిటెక్నిక్‌లో థర్డ్ ఇయర్ చదువుతుండగా, వర్ధన్ అదే కళాశాలలో పాలిటెక్నిక్ సెకండ్ ఇయర్ అభ్యసిస్తున్నాడు. విజయ్ మాత్రం పరకాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నారు. వీరు ముగ్గురు అదే ప్రాంతంలోని బీసీ హాస్టల్ ఉంటూ చదువు కొనసాగిస్తున్నారు.

రాత్రి 9.30 గంటలకు హాస్టల్ నుంచి జాతరకు..

ఆదివారం రాత్రి 9.30గంటలకు సుశాంత్, విజయ్, సి. వర్ధన్ పరకాల నుంచి బైక్‌పై ఎర్రగట్టు జాతరకు బయలుదేరారు. సుశాంత్ బైక్ నడుపుతుండగా, విజయ్, వర్ధన్ వెనుక కూర్చున్నారు. వీరితో పాటు మరికొంత మంది విద్యార్థులు కూడా వారి వెంట తమతమ బైక్‌లపై జాతరకు పయనమయ్యారు. సుశాంత్ నడుపుతున్న బైక్ ముచ్చర్ల శివారులోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న ప్రాంతానికి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి.

ఆస్పత్రికి తరలింపు..

వెనుక నుంచి బైక్‌లపై వస్తున్న స్నేహితులు క్షతగాత్రులను 108లో ఎంజీఎం తరలించారు. అప్పటికే సుశాంత్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చికిత్స పొందుతూ విజయ్ సోమవారం తెల్లవారు ప్రాణాలు వదిలాడు. వర్ధన్ పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడు సుశాంత్ తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

ప్రతిభతోనే ఉజ్వల భవిష్యత్

- కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి
- ఘనంగా ఇంజనీరింగ్ కాలేజీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డే



జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ తదితరులు

కేయూ క్యాంపస్ : ప్రతిభతోనే ఇంజనీరింగ్‌లో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. సోమవారం రాత్రి కాకతీయ యూనివర్సిటీలోని కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కాలేజీ వార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ డేను ఘనంగా నిర్వహించారు. అతిథులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలో ఇంజనీరింగ్ యువత 40శాతం మంది ఉద్యోగ, ఉపాధి రంగాల్లో దూసుకుపోతున్నారని తెలిపారు. జాతీయ హాకీ జట్టు రిటైర్డ్ కోచ్ మధుచరణ్ మాట్లాడుతూ యువత సక్సెస్‌కు చదువుతోపాటు క్రీడలు కూడా అత్యంత ప్రాధాన్యత వహిస్తాయని తెలిపారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమణ మాట్లాడారు. వివిధ క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కల్చరల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు సాంప్రదాయ నృత్యాలతోపాటుగా ఆధునిక డ్యాన్స్‌లతో హోరెత్తించారు. అధ్యాపకులు సీహెచ్ రాధిక, ఆసిం ఇక్బాల్, వి.మహేందర్, శ్రీధర్ కుమార్, సుమలత, దాసరి శైలజ, రాజేశ్వరి, పర్వీన్,శిరీష బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.